# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ అక్టోబర్ 21 సోమవారం 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 98

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





కృష్ణానదికి మరోసారి పోటెత్తిన వరద




## రేవంత్ సర్కారుపై ధ్వజమెత్తిన కిషన్ రెడ్డి

గ్రూప్-1, ముత్యాలమ్మ ఆలయం ఘటనలతో హైదరాబాద్ అట్టుడుకుతోంది: కిషన్ రెడ్డి

వీహెచ్ పీ కార్యకర్తలను ఉగ్రవాదులను కొట్టినట్టు కొట్టారన్న కిషన్ రెడ్డి

నిరసన తెలిపే హక్కు కూడా లేదా అంటూ ఆగ్రహం




## సీఎం రేవంత్‌పై సెటైర్లు



### గ్రూప్-1 అభ్యర్థుల ఆందోళన...

# మరోసారి ఉద్రిక్తత

తెలంగాణలో అక్టోబరు 21 నుంచి గ్రూప్-1 మెయిన్స్

జీవో 29 రద్దు చేయాలంటూ సుప్రీంను ఆశ్రయించిన విద్యార్థులు

తీర్పు వచ్చే వరకు మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్

**హైదరాబాద్** :అక్టోబరు 21 నుంచి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైన సంగతి తెలిసిందే. అయితే, ఈ పరీక్షలకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.29 రద్దు చేయాలని గ్రూప్-1 అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తీర్పు వచ్చే వరకు గ్రూప్-1 మెయిన్స్ వాయిదా వేయాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అయితే, ప్రభుత్వం పరీక్షల నిర్వహణకే మొగ్గు చూపుతుండగా, గ్రూప్-1 అభ్యర్థులు హైదరాబాదులో అశోక్ నగర్ లో ఇప్పటికే ఆందోళన కూడా చేపట్టారు. వారికి బండి సంజయ్, హరీశ్ రావు వంటి విపక్ష నేతలు కూడా మద్దతు పలికారు. తాజాగా, అశోక్ నగర్ లో మరోసారి ఉద్రిక్తత చోటుచేసుకుంది. గ్రూప్-1 అభ్యర్థులు ప్రెస్ మీట్ పెట్టేందుకు ప్రయత్నించారు. అయితే, పోలీసులు వారిని అడ్డుకున్నారు. దాంతో, విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో పోలీసులు వారిని అరెస్ట్ చేశారు.



## త్యాగాలు చేయకుండా గొప్ప నాయకులం కాలేం

**జీవితంలో రిస్క్ లేకుండా గొప్ప విజయాలు సాధించలేమని.. త్యాగాలు చేయకుండా గొప్ప నాయకులం కాలేమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.**

**హైదరాబాద్:** జీవితంలో రిస్క్ లేకుండా గొప్ప విజయాలు సాధించలేమని.. త్యాగాలు చేయకుండా గొప్ప నాయకులం కాలేమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంచి లీడర్ కావాలంటే ధైర్యం, త్యాగం ఉండాలని చెప్పారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో నిర్వహించిన లీడర్‌షిప్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు. “మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, మన్మోహన్‌సింగ్, పీవీ నరసింహారావు సహా ఎంతోమంది నాయకులు మనందరికీ ఆదర్శం. నాయకత్వ లక్షణాలను వారి నుంచే నేర్చుకున్నాను. నాయకులు డబ్బు, సమయం, వ్యక్తిగత జీవితం.. ఇలా అన్నీ త్యాగం చేయాలి. మంచి లీడర్ కావాలంటే ధైర్యం, త్యాగం ఉండాలి. సిగ్గుపడకుండా ప్రజలతో మమేకమవ్వాలి. ఐఎస్‌బీలో ఉన్న వారంతా తెలంగాణ, దేశానికి అంబాసిడర్లు. హైదరాబాద్‌ను 600 మిలియన్ సిటీగా మార్చేందుకు మీ అందరి సహకారం కావాలి. తెలంగాణను ఇతర రాష్ట్రాలతో పోల్చను. న్యూయార్క్, లండన్, పారిస్‌తో పోల్చాలనుకుంటాను. మీరంతా తెలంగాణలో 2, 3 ఏళ్లు పనిచేయాలి. మా ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల తరహాలో మంచి జీతాలు ఇవ్వలేకపోవచ్చు. కానీ..

మంచి సవాళ్లు, జీవితానికి సరిపడా నాలెడ్జ్ అందిస్తుంది. దురదృష్టవశాత్తు ఒలింపిక్స్‌లో భారత్ స్వర్ణపతకాలు గెలవలేకపోయింది.

అక్కడ అత్యధిక పతకాలు గెలవడమే లక్ష్యంగా పని చేస్తున్నాం.

## కుమార్తె కోసం ఎన్నికల ప్రచారం



**వయనాడ్:**కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వయనాడ్ లోక్ సభ స్థానం ఉప ఎన్నికలో పోటీ చేస్తుండడం తెలిసిందే. ఇటీవలి ఎన్నికల్లో రాహుల్ గాంధీ వయనాడ్, రాయ్ బరేలి రెండు చోట్ల గెలుపొందారు. దాంతో ఆయన వయనాడ్ సీటును వదులుకోవడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ స్థానంలో రాహుల్ సోదరి ప్రియాంక గాంధీని బరిలో దింపాలని కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయించింది. వయనాడ్ లో కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రియాంక పేరును ఇటీవలే అధికారికంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో, తన కుమార్తె ప్రియాంక గాంధీ కోసం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్ పర్సన్ సోనియా గాంధీ స్వయంగా ఎన్నికల ప్రచారానికి తరలిరానున్నారు. ప్రత్యక్ష ఎన్నికల్లో పాల్గొనడం ప్రియాంక గాంధీకి ఇదే తొలిసారి కావడంతో, కాంగ్రెస్ నాయకత్వం వయనాడ్ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. వయనాడ్ లో నవంబరు 13న పోలింగ్ జరగనుంది. నవంబరు 23న ఫలితాలు వెల్లడించనున్నారు.

ఈ నేపథ్యంలో, ప్రియాంక తరఫున ప్రచారం చేసేందుకు సోనియా కేరళ రానున్నారు. సోనియా చాన్నాళ్ల తర్వాత కేరళ వస్తుండడంతో రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో ఉత్సాహం నెలకొంది

. సోనియా... తన కుమారుడు రాహుల్ గాంధీ, కుమార్తె ప్రియాంక గాంధీతో కలిసి ఎల్లుండి (అక్టోబరు 22) వయనాడ్ లో భారీ రోడ్ షోలో పాల్గొంటారు. ఈ రోడ్ షోను విజయవంతం చేయడానికి రాష్ట్ర కాంగ్రెస్ వర్గాలు భారీ ఏర్పాట్లు చేస్తున్నాయి.కాగా, వయనాడ్ లో ప్రియాంక గాంధీపై బీజేపీ యువ నేత నవ్య హరిదాస్ ను బరిలో దించుతోంది.

ఇటీవల ఎన్నికల్లో వయనాడ్, రాయ్ బరేలి నుంచి నెగ్గిన రాహుల్

వయనాడ్ సీటును వదులుకున్న కాంగ్రెస్ అగ్రనేత

నవంబరు 13న ఉప ఎన్నిక

కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగుతున్న ప్రియాంక గాంధీ




# సీఎం రేవంత్‌పై హరీశ్‌రావు సెటైర్లు

కరీంనగర్‌జిల్లా: ప్రజల్ని ఇబ్బంది పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు మరో ఉద్యమం రావాల్సిందేనని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం(అక్టోబర్20) తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలో జరిగిన అలయ్ బలయ్ సభలో ఎమ్మెల్యే హరీష్ రావు మాట్లాడారు.'కాంగ్రెస్ వాళ్లు మోసపూరితంగా అధికారం చేజిక్కించుకున్నారు. ఇప్పుడు ప్రజలను గోస పెడుతున్నారు. కరోనా సమయంలోనూ రైతులకు రైతుబంధు పడాలన్న ఆశయంతో నడిచింది కేసీఆర్ ప్రభుత్వం.రూ.10వేలు వద్దు..రూ.15వేలు ఇస్తా అన్న రేవంత్ ఏం చేస్తున్నాడు.రేవంత్ రైతు వ్యతిరేకి. యాసంగికైనా రైతుబంధు కావాలంటే అందరూ సంఘటితం కావాలిఆరు గ్యారెంటీ పథకాలు ఏమయ్యాయి రేవంత్. ఫించన్‌లో కూడా దగా చేస్తుండు. ఎనుముల రేవంత్ రెడ్డి కాదు ఎగవేతల రేవంత్ రెడ్డి. చీఫ్ మినిస్టర్ కాదు చీటింగ్ మ్యాన్. బోనస్ ఇస్తా అంటివి..ఏడపోయింది? దేవుడి మీద ఒట్టు పెట్టి రాజకీయం చేసే నాయకుడిని ఇప్పటి వరకు నేను చూడలేదు.రేవంత్ రెడ్డి చేసిన పాపాలకు ప్రజల్ని కాపాడు అని లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి వెళితే నాపై కేసు పెట్టారు. నిరుద్యోగులను దేశ ద్రోహుల్లా చూస్తున్నారు.2లక్షల ఉద్యోగాలు ఇస్తా అంటివి ఏమయ్యాయి. జీఓ 29 రద్దు చేయడమే గ్రూప్ 1 సమస్యకు పరిష్కారం.

# కృష్ణానదికి మరోసారి పోటెత్తిన వరద

**ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణానదికి వరద**

**శ్రీశైలం ప్రాజెక్టుకు 1. 9 లక్షల క్యూసెక్కుల వరద**

**ఔట్ ఫ్లో 1.11 లక్షల క్యూసెక్కులు**

**ప్రకాశం బ్యారేజీ నుంచి 77వేల క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల**



కృష్ణానది:ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణానదికి మళ్లీ వరద వస్తోంది. వరద ప్రవాహం పెరగడంతో శ్రీశైలం ప్రాజెక్టు వద్ద అధికారులు నాలుగు గేట్లు ఎత్తి 1.11 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇన్ ఫ్లో 1.9 లక్షల క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుత 884.90 అడుగులకు చేరింది. మరోవైపు, నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిండు కుండలా మారింది. ప్రాజెక్టు నీటి మట్టం 590 అడుగులకు చేరుకుంది. దీంతో 12 గేట్లు 5 అడుగుల మేర ఎత్తి 97 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 1,38,338 ఇన్ ఫ్లోను కుడి, ఎడమ కాల్వల ద్వారా విడుదల చేస్తున్నారు. సాగర్ నీటి నిల్వ సామర్థ్యం 31,204 టీఎంసీలు కాగా, ప్రస్తుతం పూర్తి స్థాయికి చేరుకుంది. పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది. దీంతో అయిదు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇన్ ఫ్లో 1.18 లక్షల క్యూసెక్కులుగా ఉండగా, ఔట్ ఫ్లో 1.36 లక్షల క్యూసెక్కులుగా ఉంది. ఈ క్రమంలో ప్రకాశం బ్యారేజీకి 77,750 క్యూసెక్కుల నీరు వస్తుండగా, అంతే మొత్తంలో నీటిని అధికారులు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. కృష్ణానదికి వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. మత్స్యకారులు ఎవరూ నదిలో చేపల వేటకు వెళ్లవద్దని సూచిస్తున్నారు.

# రేవంత్ సర్కారుపై ధ్వజమెత్తిన కిషన్ రెడ్డి



**హైదరాబాద్** :గ్రూప్-1 అభ్యర్థుల విషయంలో ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని హితవుతెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై రాష్ట్ర బీజేపీ చీఫ్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మరోసారి ధ్వజమెత్తారు. గ్రూప్-1 అభ్యర్థుల ఆందోళనలు, సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయం ఘటనతో హైదరాబాద్ అట్టుడుకుతోందని అన్నారు. నిన్న సికింద్రాబాద్ లో వీహెచ్ పీ కార్యకర్తలపై విచక్షణ రహితంగా లాఠీచార్జి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిని ఉగ్రవాదులను కొట్టినట్టు కొట్టారని విమర్శించారు. నగరంలో పలు హిందూ పండుగలపై ఆంక్షలు విధించారని, కనీసం నిరసన తెలిపే హక్కు కూడా లేదా? అని కిషన్ రెడ్డి మండిపడ్డారు. హిందువులపై ఎందుకీ వివక్ష వైఖరి? అంటూ ధ్వజమెత్తారు. ఇక, గ్రూప్-1 అభ్యర్థులపైనా లాఠీలు ఝుళిపించారని, ఇంతకంటే దారుణం ఉంటుందా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇకనైనా గ్రూప్-1 అభ్యర్థుల విషయంలో తన మొండి వైఖరి వీడాలని కిషన్ రెడ్డి హితవు పలికారు.

# ఘనంగా మహాలక్ష్మి అమ్మవారికి బోనాలు.

## - పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, అక్టోబర్ 20:**



నగరంలోని వినాయక నగర్, కంటేశ్వర్ లలో మహాలక్ష్మి అమ్మ వారికి ఆదివారం ఘనంగా బోనాల పండుగ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధన్ పాల్ మాట్లాడుతు, తెలంగాణ సంస్కృతి సాంప్రదాయలలో ఒకటి బోనాల పండుగని, రాష్ట్ర వ్యాప్తంగా ఆశడమాసం నుండి ప్రజలందరు భక్తి శ్రద్దలతో బోనం చేసి అమ్మవారిని కొలవడం అనవయితీగా వస్తుందని అన్నారు. అమ్మవారికి పూజలు చేసి, నైవేద్యం సమర్పించడం జరుగుతుందని, సకాలంలో వర్షాలు కురిసి రైతన్నలు అధిక పంటలు పండించాలని పిల్లజల్లా, గొడ్డు గోదా అన్నింటిని కాపాడాలని ఆ అమ్మవారిని పూజించడం జరుగుతుందని అన్నారు. అమ్మవారే స్వయంగా తమ ఇంటికి వచ్చినట్లు భక్తులందరు భావిస్తారని, అమ్మ దయ ఉంటే అన్ని ఉన్నట్లే అని అన్నారు. అమ్మవారు ఇందూర్ నగర ప్రజలందరిని అష్టఐశ్వర్యాలతో, సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కాపాడాలని, ఆ అమ్మవారి ఆశీర్వాదం ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోల్ల లక్ష్మి నారాయణ, మహాలక్ష్మి ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, మున్నూరు కాపు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రగతీశీల ఆలోచనలు సజీవంగా ఉండాలి.

## పిడిఎస్ యు పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురువారెడ్డి.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, అక్టోబర్ 20**










**ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ ఆర్.లింబద్రి మాట్లాడుతూ...**

ప్రగతిశీల విద్యార్థుల ఆలోచనలు సజీవంగా ఉండాలని పి.డి.ఎస్.యూ మొదటి, పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురువారెడ్డి అన్నారు.జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్ లో పి.డి.ఎస్.యూ 50వ అర్ధ శతాబ్ది ఉత్సవ సభను ఆదివారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారెడ్డి మాట్లాడుతూ, శ్రీకాకుళ, నక్సల్ బరి పోరాటాలు వెల్లువెత్తుతున్న కాలంలో ప్రగతీశీల ఆలోచన విధానంతో పి.డి.ఎస్.యూ విద్యార్థి సంఘం ఏర్పడిందని అన్నారు. సమాజం పట్ల బాధ్యతగా ఎలా ఉండాలో పి.డి.ఎస్.యూ నేర్పుతుందని, మంచి ఆలోచన విధానాన్ని పెంచుతుందని గుర్తు చేశారు. విశ్వవిద్యాలయాల ముందు ఎగిరే బిగి పిడికిలి జెండా ఏ విద్యార్థి ఎటు వైపు దారి ఎంచుకోవాలో నేర్పుతుందని అన్నారు. ప్రభుత్వ హాస్టల్స్ లలో పురుగుల అన్నం, నీళ్లచారు నుండి ఈ రోజు కొంత మెరుగైన భోజనం అందుతుంది అంటే అది విద్యార్థి పోరాటాల వల్లనే అని అన్నారు. బడిలో చెప్పని చదువులు బ్రతుకులో తరిచి చూసి భవితవ్యపు జీవితానికి దారులు వేసేలా చేసేదే పిడిఎస్ యు అని ఉద్ఘాటించారు. అసమానతలు లేని సమాజ ఏర్పాటు ప్రస్తుత విద్యార్థుల మీద ఉందని అన్నారు . మన లక్ష్యం గొప్పదైనప్పుడు ఎన్ని సమస్యలైనా ఎదుర్కోవాలని, 80శాతం మంది విద్యార్థులు ప్రైవేటు సెక్టార్ లో చదువుకుంటున్నారని, వారిలో ప్రగతిశీల భావాజాలాన్ని పెంపొందించాలని అన్నారు. ఇలాంటి సమ్మేళనాలు మరిన్ని జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పూర్వ పి.డి.ఎస్.యూ నాయకులు పద్మారావు, మాధవరావు, శ్రీదేవి, శ్రీహరి, సాయి కుమార్, ఆకుల పాపయ్య, భాస్కర్, సంఘం, బి.ఎన్. బి, భూమన్న, విజయ రేఖ, అరుణ రేఖ, దాసు, గౌతమ్ ప్రసాద్, పరుచూరి శ్రీధర్ , సల్ల సత్య నారాయణ, శ్యామ్, రమేష్, పస్క నర్సయ్య, సరిత, ఎల్ బి రవి, ప్రస్తుత అధ్యక్ష కార్యదర్శులు ఆర్ గౌతం కుమార్, జన్నారపు రాజేశ్వర్, కార్తీక్, ప్రిన్స్ , తదితరులు పాల్గొన్నారు.

# సంఘటిత శక్తితోనే తెలంగాణ రాష్ట్రం సాకారం.

## - ఎమ్మెల్సీ, పూర్వ జేఏసీ నేత కోదండరాం.

**వేగుచుక్క న్యూస్.**



ప్రజల సంఘటిత శక్తితోనే తెలంగాణ రాష్ట్రం సాకారమైందని తెలంగాణ జన సమితి అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు ప్రొపెసర్ కోదండరామ్ అన్నారు. జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో టీఎన్జీవో భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కోదండరాం పాల్గొని ప్రసంగించారు. కేసీఆర్ అనే ఒక వ్యక్తి వల్ల తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిందనే గత భారాస సర్కారు, ప్రచారం చేయడం తెలంగాణ ప్రజలను అవమానించడమేనని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ జమానాలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించుమన్నందుకే అరెస్ట్ లు చేసి, నిర్బంధాలు అమలు చేశారని, నిరంకుశ ప్రభుత్వ నేతలు నేడు నిరుద్యోగ గ్రూప్ వన్ అభ్యర్థులను తమ స్వార్థ%శీ%కోసం వాడుకోవడం దుర్మార్గమని ఆయన ధ్వజమెత్తారు. భారాస పదేళ్ల పాలన విధ్వంసాన్ని తెలంగాణ సమాజం అనుభవించిందని, వాటి తాలూకు శిథిలాల నడుమ తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణం జరుగుతున్న దని కోదండరామ్ పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా భారాస కార్యాలయం ప్రభుత్వ నీటిపారుదల శాఖ స్థలంలో నిర్మించారని, ఆ అక్రమ కట్టడాన్ని కూల్చివేయించే కార్యక్రమం ప్రజలు చేస్తారని తెలంగాణ జేఏసీ చైర్మన్, సీనియర్ న్యాయవాది గోపాల్ శర్మ అన్నారు. జేఏసీ నేతలు వి.ప్రభాకర్, గైని గంగరాం లు ప్రసంగిస్తూ ఎన్నో ఆశలు, అకా%శీ%క్షలతో, అమరుల త్యాగాలతో సాధించుకున్న స్వరాష్ట్రంలో గత కేసీఆర్ పదేళ్ల పాలన చేదునే మిగిల్చిందని, ప్రజాస్వామికవాదులు కోరుకున్న తెలంగాణ కానరాలేదని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు భాస్కర్, డాక్టర్ రవీంద్ర నాథ్ సూరి, పీఓడబ్లు నాయకురాలు గోదావరి, నసీర్, డాక్టర్ మోహన్, ఆశా నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన వర్సిటీ లెక్చరర్లు.



**కాంట్రాక్టు ప్రొఫెసర్లుగా గుర్తించాలని వినతి. వేతనాల పెంపుకు డిమాండ్, వర్సిటీల్లో అసమానతలపై పిర్యాదు. న్యాయానికి ఎమ్మెల్సీ కోదండరాం హామీ.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, అక్టోబర్ 20:**

అరకొర వేతనాలతో కొన్నేళ్లుగా యూనివర్సిటీల్లో పని చేస్తున్న తమను కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ యూనివర్సిటీ పార్ట్ టైం లెక్చరర్స్ అసోసియేషన్ ఎమ్మెల్సీ కోదండరాంకు వినతి చేసింది. ఈ మేరకు అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ ప్రసన్న ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కోదండరాంను ఆదివారం కలిశారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్ లో జరిగిన రాజకీయ జేఏసీ సమావేశంలో వినతి పత్రం సమర్పించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మినిమం టైం స్కేల్ కల్పిస్తూ, వెంటనే అమలు చేయాలని కోరారు. విద్యార్హతలు ఉన్నప్పటికీని, సమాన పనికి సమాన వేతనం అమలు కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర ధరలు నింగినంటిన ప్రస్తుత సమయంలో, ఓ పిరియడ్ కు కేవలం రూ.700 మాత్రమే చెల్లిస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. యూనివర్సిటీల్లో పార్ట్ టైం లెక్చరర్లను, చిన్న చూపు చూస్తున్నారని ఆవేదన చెందారు. తమను కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా గుర్తించినప్పుడే, ఈ అసమానతలు తొలగుతాయని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో సైతం తమ పార్ట్ టైం లెక్చరర్స్ అసోసియేషన్ కదం తొక్కిందని, మీతో కలిసి నడిచిందని గుర్తు చేశారు. ఓ ప్రొఫెసర్ గా, రాజకీయ జేఏసీ చైర్మన్ గా, ఎమ్మెల్సీగా, విద్యావేత్తగా, టీజేఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షునిగా, ప్రభుత్వ మిత్ర పక్ష నేతగా తమ బాధను అర్థం చేసుకొని సమస్య పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్సీ కోదండరాం న్యాయం చేస్తానని వారికి హామీ ఇచ్చారు. పార్ట్ టైం లెక్చరర్ల సమస్యలు తన దృష్టిలో ఉన్నాయని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి, తొందరలోనే న్యాయం చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్ట్ టైం లెక్చరర్ల అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు అరిగెల హరిత, కోశాధికారి కొట్టూరి గంగాధర్, నాయకులు, లెక్చరర్లు పాల్గొన్నారు

# ప్రజా పాలనలో అభివృద్ధి బాటలు.

## - మంత్రి జూపల్లి కృష్ణారావు.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, అక్టోబర్ 20:**






కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో రాష్ట్రంలో అభివృద్ధికు బాటలు వేస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా మద్ది చంద్రకాంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు తో పారు, ప్రభుత్వం సలహాదారులు షబ్బీర్ అలీ, ఎంపీ సురేష్ కుమార్ షేట్కార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు అన్ని రంగాలలో ప్రాధాన్యం కల్పిస్తుందని అన్నారు. ప్రజా పాలన కార్యక్రమం చేపట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం జరుగుతుందని, ఎన్నికలలో ఇచ్చిన అన్ని గ్యారెంటీలను అమలు పరచడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర మహిళలు ఉచితంగా బస్సు ప్రయాణం చేస్తున్నారని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, 10 లక్షల వరకు ఆరోగ్య భీమా అందించడం జరుగుతుందని అన్నారు. రాబోవు రోజులలో జిల్లాలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లను అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. కొత్త రేషన్ కార్డులు కూడా అందించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని, ఇచ్చిన హామీ ప్రకారం ఇప్పటికే రైతన్నలకు రెండు లక్షల రుణమాఫీ చేయడం జరిగిందని, రెండు లక్షల పైన రుణమున్న వారికి కూడా రుణమాఫీ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కైలాష్ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, సుభాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.